వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 15 అక్టోబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 108

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

3లో

కలెక్టరేట్‌లో ఘనంగా "బతుకమ్మ" సంబరాలు.

2లో

విద్యుత్తు అంతరాయాలపై సీఎం ఆగ్రహం

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, జిల్లాలవారీగా ప్రస్తుత పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించిన ఉన్నతాధికారులు

- ఎన్నిసార్లు చెప్పినా మీరు మారరా!
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీలను సస్పెండ్ చేస్తా
- పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు కరెంటు సరఫరా చేయాలి
- తాగునీరు, పశుగ్రాసానికి కొరత రావద్దు
- ఎల్‌నినో.. కొవిడ్ లాంటి విపత్తు.. వచ్చే జూన్ వరకు కార్యాచరణ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

"ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై శాఖలు అప్రమత్తం కావాలి. ఈ పరిస్థితి ఎప్పటివరకు ఉంటుందో ఎవరికీ తెలియదు. ఇప్పుడు సమస్యగా కనిపిస్తోంది. ముమ్ముందు సంక్షోభంగా మారుతుంది. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ఎల్‌నినో ప్రభావాన్ని లోతుగా అంచనా వేయాలి. సమస్యలను అధిగమించేందుకు పరిష్కార మార్గాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలి. మళ్లీ వానలు వచ్చే వరకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలి. తాగునీరు, పశుగ్రాసానికి ఇబ్బందులు రాకుండా చర్యలుతీసుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతో పాటు ఇతర అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలి"

సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్ యత్నం

సైట్ విజిట్ సర్టిఫికేషన్ పేరిట రూ.10 వేల కోట్ల కుంభకోణం

సింగరేణి కార్మిక గర్జన సభలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

'నైనీ బొగ్గు టెండర్ల కుంభకోణాన్ని అడ్డుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ మొత్తాన్ని కాజేయాలనుకున్నది ఎవరు? అసలు విషయం బయటకు రావాలి. వాటాలు కుదరకనే నైనీ బ్లాక్ టెండర్లు రద్దయ్యాయి. సింగరేణిలో సైట్ విజిట్ సర్టిఫికేషన్ పేరిట సుమారు రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగింది. దీనిపై ఆధారాలతో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తే ఈ వ్యవహారంపై విచారణ జరపకుండా ఆయన సీఎంకు లేఖ రాశారు. దీని ద్వారా కాంగ్రెస్, భాజపాల మధ్య చీకటి ఒప్పందం

స్పర్శ్ హాస్పీస్ రాష్ట్రానికి గర్వకారణం: పొంగులేటి

రాయదుర్గం: జీవితంలో అత్యంత క్లిష్టమైన దశలో ఉన్న రోగులకు అండగా నిలుస్తున్న ఖాజాగూడ 'స్పర్శ్ హాస్పీస్' తెలంగాణకు గర్వకారణమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్పర్శ్ హాస్పీస్ 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం స్థానికంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. సంస్థకు ఎన్ఏబీహెచ్ (నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ (ప్రొవైడర్స్) నుంచి ధ్రువీకరణ లభించిన సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన ఎన్ఏబీహెచ్ అక్రెడిటేషన్ శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం సంస్థ సేవలకు గుర్తింపుగా లభించిన గైడ్ స్టార్ ఇండియా ధ్రువపత్రాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..స్పర్శ్ హాస్పీస్ వంటి సంస్థలకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి ప్రసంగిస్తూ.. జీవిత చరమాంకంలో ఉన్న బాధితులకు స్పర్శ్ హాస్పీస్ అంకితభావంతో సేవలందిస్తున్న తీరు ఆదర్శనీయమని కొనియాడారు. స్పర్శ్ వ్యవస్థాపక ట్రస్టీ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. దేశంలో ఎన్ఏబీహెచ్ గుర్తింపు లభించిన తొలి పాలియేటివ్ కేర్ సెంటర్ స్పర్శ్ హాస్పీస్ అని తెలిపారు.

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల..

తొలి దశ నవంబర్ 26న పోలింగ్

మూడో దశ డిసెంబర్ 2న ఎన్నికలు

మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 28న

మున్సిపల్ ఫలితాలు ఈ నెల 30న

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 3న

ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది.తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు (ఖుాదీ) ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు.

2లో

తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భరోసా

రాబోయే రోజుల్లో తయారీరంగం విస్తరణపై దృష్టి

బ్రిటన్ ప్రతినిధుల బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి

పాత రోజులంటే పాలమూరు నుంచి వలసలేనా..?

ధరూరు, గట్టు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత రోజులు తీసుకొస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. పాలమూరు ప్రజలను వలసలు పంపుతూ ఇచ్చిన మాటను అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస సీనియర్ నేత హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గద్వాల నియోజకవర్గం గట్టు మండలం ఇందువాసిలో వారం రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వలస కూలీలు మృతిచెందగా.. బాధిత కుటుంబాలను హరీశ్‌రావు బుధవారం పరామర్శించారు. పార్టీ తరఫున అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. పాలమూరు ప్రాజెక్టులను ఎండబెట్టి రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వం కారణమవుతోందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో రైతులకు గ్రహణం పట్టిందని ఆరోపించారు. జూరాలకు రెండు వందల టీఎంసీలకుపైగా వరద వచ్చినా.. ఎత్తిపోయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఓ పక్క మన జలాశయాలు వెలవెలబోతుంటే ఏపీలో నిండుగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్ యత్నం

కరీంనగర్ సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తోందని, ఆ కుట్రలను సమర్థంగా తిప్పికొడతామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణిలో నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లు, సైట్ విజిట్ సర్టిఫికేషన్, ఓపెన్ కాస్ట్ గనుల టెండర్లు, బొగ్గు ఉత్పత్తి, యంత్రాల కొనుగోళ్లలో భారీగా అవినీతి జరిగిందని ఆరోపించారు. అవకతవకలపై సీబీఐ లేదా సిటింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో తెలంగాణ బొగ్గు గనుల కార్మిక సంఘం, భారాస ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. 'నైనీ బొగ్గు టెండర్ల కుంభకోణాన్ని అడ్డుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ మొత్తాన్ని కాజేయాలనుకున్నది ఎవరు? అసలు విషయం బయటకు రావాలి. వాటాలు కుదరకనే నైనీ బ్లాక్ టెండర్లు రద్దయ్యాయి. సింగరేణిలో సైట్ విజిట్ సర్టిఫికేషన్ పేరిట సుమారు రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగింది. దీనిపై ఆధారాలతో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తే ఈ వ్యవహారంపై విచారణ జరపకుండా ఆయన సీఎంకు లేఖ రాశారు. దీని ద్వారా కాంగ్రెస్, భాజపాల మధ్య చీకటి ఒప్పందం ఉందని స్పష్టమవుతోంది. సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి తగ్గడానికి టెండర్ల నిర్వహణలో ఆలస్యమే ప్రధాన కారణం. సైట్ విజిట్ సర్టిఫికేషన్ పేరుతో టెండర్లను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారు. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో ఏడు సార్లు టెండర్లు వాయిదా వేయడం వెనుక సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన బావమరిది సృజన్‌రెడ్డిలది కీలక పాత్ర.40 లక్షల టన్నుల బొగ్గు మాయం

సింగరేణిలో 2023 డిసెంబరులో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి ఉంటే, గతేడాది 58 మిలియన్ టన్నులకు పడిపోయింది. టెండర్లలో జాప్యం, నిర్వహణ లోపాలు, నిర్ణయాలు తీసుకోవడంలో వైఫల్యమే ఇందుకు కారణం. సింగరేణివ్యాప్తంగా సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైంది. అది ఎక్కడికి వెళ్లిందో సమాధానం చెప్పాలి. యాదాద్రిలో నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తు కేంద్రాన్ని నిర్మిస్తే ప్రస్తుతం 400 మెగావాట్ల విద్యుత్తు కూడా ఉత్పత్తి కావడం లేదు. రాష్ట్రం ఏర్పడే సమయానికి విద్యుదుత్పత్తి సామర్థ్యం కేవలం 7,778 మెగావాట్లుగా ఉండేది. కేసీఆర్ పాలనలో దాన్ని 24 వేల మెగావాట్ల స్థాయికి తీసుకెళ్లాం. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు అందించిన ఘనత కేసీఆర్‌ది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోతలు పెరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతుండటంతో రైతులు మళ్లీ రోడ్డెక్కాల్సిన దుస్థితి ఎదురైంది. లోయర్ సీలేరు ప్రాజెక్టును మోదీ ప్రభుత్వం చంద్రబాబు కోరిక మేరకు ఏపీకి అప్పగించి తెలంగాణకు అన్యాయం చేసింది. సింగరేణికి ప్రభుత్వం రూ.60 వేల కోట్లు బకాయి పడింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ.నాలుగున్నర లక్షల కోట్ల అప్పు చేసిన ప్రభుత్వం వాటన్నింటినీ ఏం చేసింది? దిల్లీలోని రాహుల్‌గాంధీకి చెల్లిస్తున్నారు. సింగరేణిలో రెండేళ్లలోనే రూ.6,317 కోట్ల నిధులు పక్కదారి పట్టాయి. కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను ప్రభుత్వం ఏటా తగ్గిస్తోంది. ఇటీవల ఆర్టీసీ కార్మిక ఎన్నికల్లో వచ్చిన ఫలితమే సింగరేణి ఎన్నికల్లో పునరావృతం కావాలి. సంస్థను కాపాడుకోవడానికి కేసీఆర్ నాయకత్వం అవసరం" అని కేటీఆర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. సభలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, కోవ లక్ష్మి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోరుకంటి

చందర్, పుట్ట

మధు, గండ్ర వెంకటరమణారెడ్డి, రవిశంకర్, దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.కేటీఆర్ బుధవారం కొత్తగా కనిపించారు. ఎప్పుడూ క్లీన్ షేవ్‌తో కనిపించే ఆయన గోదావరిఖనిలో నిర్వహించిన కార్మిక గర్జన సభకు గడ్డంతో హాజరయ్యారు. సభలో ఈ విషయాన్ని కేటీఆర్ స్వయంగా ప్రస్తావించారు. కరీంనగర్‌కు రాగానే గంగుల కమలాకర్.. 'ఏందన్నా గడ్డంతో ఉన్నావ్' అని అడిగారు. 'సింగరేణి పురిటి గడ్డ గోదావరిఖని సభకు సాధారణంగా వెళ్తే ఏముంటుంది. అందుకే గడ్డంతో బయలుదేరానని చెప్పా' అని పేర్కొన్నారు.

విద్యుత్తు అంతరాయాలపై సీఎం ఆగ్రహం

హైదరాబాద్: ఎల్‌నినో నేపథ్యంలో వ్యవసాయ సీజన్‌కు వచ్చే 20 రోజులు అత్యంత కీలకమని, రాష్ట్రంలో పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్తు సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సరఫరాలో అంతరాయాలను సహించేది లేదని, పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్తు కోతలు ఉండరాదని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం చేస్తే ఐఏఎస్‌లను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఎల్‌నినో..కొవిడ్ లాంటి విపత్తు అని, దీనిని ఎదుర్కొనేందుకు జూన్ వరకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్తు, తాగునీటి సరఫరాపై ఎంసీహెచ్‌ఆర్డీలోని బోధిభవన్‌లో బుధవారం సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిచారు.

విద్యుత్తు అధికారులపై ఆగ్రహం

ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయాలపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యుత్తు సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితిలో ఎందుకు మార్పు రావడం లేదు?రాబోయే రోజుల్లో విద్యుత్తు కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్తు ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది నేను. పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితి మారలేదు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించేది లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోను" అని సీఎం అధికారులను హెచ్చరించారు. వైఫల్యాలపై విద్యుత్తు శాఖ స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీ..సంబంధిత విభాగపు ఐఏఎస్‌లను సస్పెండ్ చేస్తానన్నారు. విద్యుత్తు అంతరాయాలకు రోజుకో కారణం చెప్పొద్దన్నారు.ప్రతి మండలానికి ప్రత్యేక పర్యవేక్షణ అధికారులు "ఎల్‌నినో ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి గ్రూప్1, గ్రూప్2 స్థాయి అధికారులను నియమించాలి. ఆయా మండలాల్లో వర్షాభావ పరిస్థితులు, విద్యుత్తు, తాగునీటి సరఫరా, పంటలు, పశుగ్రాసం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించే బాధ్యతలను వారికి అప్పగించాలి. మండలాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి నివేదించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలకు ఎల్‌నినో విపత్తు తీవ్రతను చెప్పాలి. గ్రామసభలు, కళాజాతలతో అవగాహన కల్పించాలి.

లీడర్లు దారి చూపిస్తరు.. దేశాన్ని మార్చేది జనమే: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

వెబ్ డెస్క్, అక్టోబర్ 14

సమాజ సమిష్టి కృషితోనే నిజమైన అభివృద్ధి.. జాతి నిర్మాణంలో ప్రజా భాగస్వామ్యమే కీలకమని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు.. జనాలూ జవాబుదారీగా ఉండాలె! లీడర్లు దిశ చూపిస్తరు.. ప్రభుత్వాలు విధానాలు తెస్తయ్.. కానీ దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దేది ప్రజల సమిష్టి కృషినే అని సామాజిక విశ్లేషకులు చెబుతున్నారు. కేవలం రాజకీయ మార్పులతో సమాజం మారదని, ప్రతి పౌరుడు తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినప్పుడే అసలైన ప్రగతి సాధ్యమని స్పష్టం చేస్తున్నారు. పరిశుభ్రత, క్రమశిక్షణ, ఐక్యత, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎవరి వంతు వారు భాగస్వాములైతేనే దేశం ముందుకు దూసుకుపోతుంది. సర్కారు ఒక్కటే దేశాన్ని మార్చలేదు.. ప్రజలు కదిలితేనే అభివృద్ధికి అసలైన జోష్ వస్తది..

మన కల్చరే మన గ్లోబల్ పవర్.. ప్రపంచాన్ని కలుపుతున్న భారతీయ కళలు!. మోదీ

వెబ్ డెస్క్, అక్టోబర్ 14:మన దేశం పాట, ఆట, సినిమా, వంటకం.. అన్నీ గ్లోబల్ లెవల్‌లో ఇండియా పేరును మార్మోగిస్తున్నయ్..భారతీయ సంస్కృతి ప్రపంచ దేశాలతో బంధాలను బలోపేతం చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడిన్రు. ఢిల్లీలో అక్టోబర్ 14 నుంచి 16 వరకు జరుగుతున్న 'బృహత్తర భారత్' అంతర్జాతీయ సదస్సుకు పంపిన సందేశంలో ఈ వ్యాఖ్యలు చేసిన్రు. చారిత్రక కట్టడాలతో పాటు 'జ్ఞాన్ భారతం' కార్యక్రమం ద్వారా పురాతన తాళపత్రాలనూ పరిరక్షిస్తున్నట్లు తెలిపిన్రు. విదేశాల్లో ఉన్న భారతీయ పురాతన కళాఖండాలను తిరిగి తీసుకొచ్చే ప్రయత్నాలకూ ఊపు పెరిగిందన్నారు. ఐజీఎన్ఏ నిర్వహిస్తున్న ఈ సదస్సులో వివిధ దేశాల ప్రతినిధులు, రాయబారులు, పండితులు పాల్గొంటున్నారు. మన సంస్కృతి మన గర్వం.. ప్రపంచంతో మన అనుబంధమే అసలైన బలం!

తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భరోసా

హైదరాబాద్: తెలంగాణలో పెట్టిన పెట్టుబడులు పూర్తి భద్రతతో, సురక్షితంగా ఉంటాయని.. ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కొనసాగుతోందని యార్క్‌షైర్, యూకే వ్యాపార ప్రతినిధి బృందానికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో తయారీరంగాన్ని భారీగా విస్తరించడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సౌత్‌యార్క్‌షైర్, యార్క్ అండ్ నార్త్‌యార్క్‌షైర్, వెస్ట్ యార్క్‌షైర్ మేయర్లు ఆలివర్ కోపార్డ్, డేవిడ్ స్కేత్, ట్రేసి బ్రాబిన్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి యూకే ప్రతినిధి బృందం బుధవారం ఎంసీహెచ్‌ఆర్‌డీలో సీఎంతో సమావేశమైంది. గతేడాది డిసెంబరులో ప్రారంభించిన రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధి రోడ్‌మ్యాప్ 'తెలంగాణ రైజింగ్ 2047' తయారీలో బ్రిటన్ మాజీప్రధాని టోనిబ్లెయిర్ ఒక విజ్ఞాన భాగస్వామిగా కీలకపాత్ర పోషించారని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యంత పిన్నవయసు గల తెలంగాణ.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్, లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్ తయారీరంగాల్లో ఆధిపత్యం చెలాయిస్తూ అత్యంత చైతన్యవంతమైన రాష్ట్రాల్లో ఒకటిగా ఆవిర్భవించిందన్నారు. 30వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న భారత ఫ్యూచర్‌సిటీ మాస్టర్‌ప్లాన్‌ను త్వరలో ఆవిష్కరిస్తామని చెప్పారు. మూసీ పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్‌లో రివర్‌ఫ్రంట్, నైట్ ఎకానమీని అభివృద్ధి చేయాలనుకుంటున్నామని తెలిపారు. వచ్చే డిసెంబరు 7-9 తేదీల్లో భారత ఫ్యూచర్‌సిటీలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్-2026'కు హాజరు కావాలని ఈ సందర్భంగా యూకే బృందాన్ని సీఎం ఆహ్వానించారు. కార్యక్రమంలో 'యూకే-ఇండియా సెటా అండ్ రీజినల్ సినర్జీస్' పేరుతో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను ఆవిష్కరించారు.

తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ప్రతినిధి బృందం ఆసక్తి

తెలంగాణతో కలిసి అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, వైద్య ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్నికల్ టెక్స్‌టైల్స్, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన రంగాల్లో కలిసి పనిచేసేందుకు యూకే బృందం ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ రంగాల్లో ఒప్పందాల కోసం మరోసారి తెలంగాణలో పర్యటించాలని భావిస్తున్నట్లు తెలిపారు. సౌత్‌యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కోపార్డ్ మాట్లాడుతూ.. తెలంగాణలోని డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార విస్తరణ అవకాశాలు ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసిబ్రాబిన్ మాట్లాడుతూ..యార్క్‌షైర్, తెలంగాణ మధ్య అనేక సారూప్యతలున్న నేపథ్యంలో రెండు ప్రాంతాలు సోదరభావంతో కలిసి పనిచేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అంతకుముందు ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు యూకే ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. జినోమ్‌వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో కిశోర్ జయరామన్, హైదరాబాద్ బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్‌జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పేదోళ్ల సొంతింటి కలకు ఇందిరమ్మ టవర్స్.. పోచారంలో పనులు షురూ!

రూ.43 కోట్లతో 480 మందికి ఫ్లాట్లు.. సెలక్షన్‌లో ఫుల్ పారదర్శకత అంటున్న మంత్రి!

, అక్టోబర్ 14

:పేదోళ్ల సొంతింటి కల నిజం చేయడమే కాంగ్రెస్ సర్కారు టార్గెట్ అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పిన్రు బాస్! ఘట్కేసర్ సర్కిల్ పోచారం డివిజన్‌లో రూ.43 కోట్లతో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌కు బుధవారం శంకుస్థాపన చేసిన్రు. మొత్తం 480 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లు కేటాయించనున్నట్టు తెలిపిన్రు. అప్లికేషన్ల వెరిఫికేషన్ తర్వాత పారదర్శకంగా సెలక్షన్ ఉంటుందని, స్థానికులకే ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేసిన్రు. రెండు మూడు విడతల్లో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, కొత్తగా అప్లై చేసుకునే వాళ్లకూ ఛాన్స్ ఉంటుందని చెప్పిన్రు. రిజిస్ట్రేషన్ కూడా ఫ్రీగా చేస్తామని, డాక్యుమెంట్లతో బ్యాంక్ లోన్ తీసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించిన్రు.

ఓటర్ల లిస్టుపై ఒవైసీ పంజా.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలా!

వెబ్ డెస్క్, అక్టోబర్ 14:

ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టు మెట్లు ఎక్కిన్రు.. దేశవ్యాప్తంగా ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఛాలెంజ్ చేస్తూ పిటిషన్ వేశారు. సరైన ప్రొసీజర్ పాటించకుండా ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని ఆయన ఆరోపించిన్రు. ఫారం-6 మ్యాపింగ్ నిబంధనలు ఓటర్లకు భారమవుతున్నాయని చెబుతూ, సర్ పై స్టే ఇవ్వాలని కోరిన్రు. ఒవైసీ తరఫున అడ్వకేట్ నిజాముద్దీన్ పాషా వాదనలు వినిపించిన్రు. ఇప్పటికే రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు కూడా ఈ అంశంపై పిటిషన్లు దాఖలు చేసిన్రు. సంబంధిత పిటిషన్లతో కలిపి విచారణ చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని సీజేఐ తెలిపినట్లు సమాచారం.

హైదరాబాద్‌లో ఇండీ కూటమి దమ్ము చూపిస్తదా?

ఈ నెల 24న భారీ సభకు ప్లాన్..లక్ష మంది జనసమీకరణపై కాంగ్రెస్ ఫోకస్!

హైదరాబాద్, అక్టోబర్ 14:

హైదరాబాద్ వేదికగా జాతీయ రాజకీయాల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం రెడీ అవుతోందట.. ఈ నెల 24న ఇండీ కూటమి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. సుమారు లక్ష మందిని సమీకరించేలా టీపీసీసీ నేతలు కసరత్తు చేస్తున్నారట. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కూటమి అగ్రనేతలు, ముఖ్యమంత్రులు హాజరవుతారని ప్రచారం జరుగుతోంది. సభా వేదిక, ట్రాన్స్‌పోర్ట్, సెక్యూరిటీ ఏర్పాట్లపై నేతలు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సమస్యలే ఎజెండాగా కేంద్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడమే సభ లక్ష్యమని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

వేగుచుక్క

వాణిజ్య కమిటీ సమావేశాల్లో పాల్గొన్న ఎంపీ అర్విందా.

వేగుచుక్క న్యూస్, న్యూఢిల్లీ:

నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి న్యూఢిల్లీలో జరిగిన విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో, అలాగే వాణిజ్య కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.

ఎఫ్ సిఆర్ఎ సవరణ బిల్లుపై విస్తృత చర్చలు

ఎఫ్ సిఆర్ఎ సవరణ బిల్లును సమగ్రంగా పరిశీలించేందుకు ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో విదేశీ విరాళాల నియంత్రణ, వాటి వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం, చట్టపరమైన నిబంధనల అమలు వంటి కీలక అంశాలపై చర్చ జరిగింది.

ఈనెల 12, 13 తేదీల్లో జరిగిన సమావేశాల్లో వివిధ మత, సామాజిక, సేవా సంస్థల ప్రతినిధులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, న్యాయ నిపుణులు, విద్యాసంస్థల ప్రతినిధుల నుంచి బిల్లుపై అభిప్రాయాలు, సూచనలను కమిటీ స్వీకరించింది. విదేశాల నుంచి అందే నిధులు చట్టబద్ధమైన మార్గాల్లో వినియోగించబడేలా చూడటం, నిధుల వినియోగంలో పారదర్శకతను పెంపొందించడం, సంబంధిత సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం వంటి అంశాలు ఈ సమావేశాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

వాణిజ్య కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ

న్యూఢిల్లీలో బుధవారం జరిగిన వాణిజ్య కమిటీ సమావేశంలోనూ ఎంపీ అర్వింద్ ధర్మపురి పాల్గొన్నారు. దేశ వాణిజ్య రంగ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, ఎగుమతుల ప్రోత్సాహం, దేశీయ పరిశ్రమలకు అవకాశాల కల్పన, వాణిజ్య రంగంలో ఎదురవుతున్న సవాళ్లు వంటి అంశాలపై పార్లమెంటరీ కమిటీల ద్వారా జరిగే పరిశీలనలు, చర్చలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైనవి. పార్లమెంటరీ కమిటీల సభ్యుడిగా వివిధ రంగాలకు సంబంధించిన విధానపరమైన అంశాల పరిశీలనలో భాగస్వామ్యం కావడం ద్వారా ఎంపీ అర్వింద్ ధర్మపురి దేశ అభివృద్ధికి సంబంధించిన చర్చల్లో తన వంతు పాత్ర పోషిస్తున్నారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విధానాల రూపకల్పనలో పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన అమలు అత్యంత కీలకమని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో పాల్గొని, దేశ అభివృద్ధికి దోహదపడే విధానపరమైన చర్చల్లో భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.

మోదీ 25ఏళ్ల పాలనలో అభివృద్ధి దిశగా భారత్..

కేంద్ర పథకాలతో కోట్ల మంది లబ్ధి..

ఛాయ్ పే చర్చ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్ పాల్...

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని, ప్రపంచంలో విశ్వ గురువుగా నిలువస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా రాజకీయ జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రద్ధానంద్ గంజిలో బుధవారం " చాయ్ మిలన్ ఏ మోదీ జీ 25" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..13 ఏళ్లు ముఖ్యమంత్రిగా 12 ఏళ్ల దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ ఎనలేని ప్రజాసేవ చేస్తున్నారని గుర్తు చేశారు. అనేక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చి రైతులు, మహిళలు, పేద కుటుంబాలు, వృద్ధులు, విద్యార్థులు, చిరు వ్యాపారులకు అండగా నిలుస్తున్నారన్నారు. వైద్యం, ఇల్లు, బ్యాంకింగ్, ఆహార భద్రత వంటి రంగాల్లో పెనుమార్పులు తీసుకొచ్చారన్నారు. జన్ధన్ యోజన ఉజ్వల యోజన కిసాన్ సామాన్ నిధి ఆయుష్మాన్ భారత్ ఆవాస్ యోజన గరీబ్ కళ్యాణ్ అన్న యోజన జల్జీవన్ మిషన్ తదితర పథకాలతో కోట్ల మంది లబ్ధిపొందుతున్నారన్నారు. 2014 తర్వాత జాతీయ రహదారులు, రైల్వే, ఆసుపత్రులు, అంతరిక్షం, వైమానిక, సైనిక రంగాల్లో ఎన్నో రెట్ల వృద్ధి జరిగిందన్నారు. భారతదేశ జిడిపి 10వ స్థానం నుంచి ఏకంగా 4వ స్థానంకి ఎగబాకడం కేవలం మోదీ వల్లనే సాధ్యమైందని చెప్పారు. అనంతరం ఇందూరు ఛాయ్ వాలా మాదాసు స్వామి యాదవ్ మాట్లాడుతూ.. భారతదేశ చరిత్రలో చిరస్మరణీయమైన నాయకుడు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని కొనియాడారు. నిరుపేద తల్లి కడుపున పుట్టి రైలులో చాయ్ విక్రయిస్తూ ప్రధాని స్థాయికి ఎదిగారన్నారు. 25 సంవత్సరాల ఈ ప్రజా రాజకీయ జీవితం రాబోయే తరాలకు మార్గదర్శనం వంటిదన్నారు. తన కుటుంబ మూలాలు కూడా చాయ్ అమ్మిన కుటుంబానికి చెందినవి కావడం పట్ల ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు శ్యామ్, కార్పొరేటర్లు బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, నిజామాబాద్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కమల్ కిషోర్ , గుమస్తా సంఘం అధ్యక్షులు బాలు, దడువై సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, హమాలీ సంఘం అధ్యక్షులు అంజయ్య యాదవ్, పైట వెంకటేశం, ఆగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో.. సత్తా చాటిన "సత్యశోధక్" విద్యార్థినులు.

వేగుచుక్క న్యూస్, సిరికొండ:

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో.. "సత్యశోధక్" విద్యార్థినులు సత్తా చాటారు. నిజామాబాద్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ క్రీడా మైదానంలో నిర్వహించిన 11వ రాష్ట్ర స్థాయి మినీ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ (అండర్-13) బాలికల పోటీల్లో విజేతలుగా నిలిచారు. నిజామాబాద్ జిల్లా జట్టులో సత్యశోధక్ పాఠశాల విద్యార్థినులు ఏ. యుగేశ్వరి, ఎం. మేఘన అద్భుత ప్రతిభ కనబరిచారు. నిజామాబాద్ జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి బంగారు పతకాలు సాధించారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఏ. యుగేశ్వరి, ఎం. మేఘనలు రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను చాటి జిల్లాకు, పాఠశాలకు ఘన కీర్తి తీసుకురావడం అభినందనీయం.

విజేతలకు పలువురి అభినందనలు.

ఈ సందర్భంగా బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు, జక్రాన్‌పల్లి ఎంఈఓ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. గంగమోహన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి గంగాధర్ తదితరులు అభినందించారు.

పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం.

విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించడం పట్ల సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం చేస్తూ, విద్యార్థినులను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు అనికేత్, అనిల్‌లను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వారాహీ క్షేత్రంలో భక్తజన సందోహం.

నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజు పోటెత్తిన భక్తులు.

ఆధ్యాత్మిక శోభతో వెలిగిన ఆలయం!

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

నగరంలోని అమ్మవెంచర్‌లో కొలువుదీరిన శ్రీ వారాహీ క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి వైభవంతో కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన బుధవారం ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా, అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయి, పూజా కార్యక్రమాలు, అమ్మవారి నామస్మరణలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర పూజలు, పల్లకి సేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళహారతి సమయంలో ఆలయ ప్రాంగణమంతా భక్తి భావంతో నిండిపోయింది. కుటుంబ సమేతంగా విచ్చేసిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. నవరాత్రుల ప్రారంభం నుంచి వారాహీ క్షేత్రంలో ప్రతిరోజూ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొలిరోజున అమ్మవారికి అభిషేకం, విశేష పూజలతో పాటు వారాహీ మూలమంత్ర హవనం నిర్వహించగా, మూడో రోజు అష్టోత్తర పూజలు, పల్లకి సేవ భక్తులను ఆకట్టుకున్నాయి. నాలుగో రోజు కూడా భక్తుల సందడితో ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి.

ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ మంచాల జ్ఞానేంధర్ గుప్త మాట్లాడుతూ,

నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం 7:30 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు అష్టోత్తర పూజలు,

పల్లకి సేవ, హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వారాహీ మాత ఆశీస్సులు పొందాలని కోరారు. భక్తి పారవశ్యంలో వారాహీ క్షేత్రం.. అమ్మవారి నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం! నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల రాకతో ఇందూరులో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. లోకకల్యాణం, సకల జనుల సుఖసంతోషాల కోసం భక్తులు వారాహీ మాతను ప్రార్థించారు.

కలెక్టరేట్‌లో ఘనంగా "బతుకమ్మ" సంబరాలు.

- గౌరీమాతకు పూజలు నిర్వహించిన కలెక్టర్.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 14

: బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో టీఎన్జీఓ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని గౌరీమాతకు, రంగురంగుల పూలతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసిన బతుకమ్మలకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ గేయాలను ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు, యువతులు, మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. దాండియా, కోలాటాలతో బతుకమ్మ సంబురానికి వన్నె చేకూర్చారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యాలయ పనివేళలు ముగిసినప్పటికీ ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ ఉత్సవంలో పాల్గొని బతుకమ్మ వేడుక ఔన్నత్యాన్ని చాటారు. ఉత్తమ అలంకరణతో కూడిన బతుకమ్మలను ఎంపిక చేసి, బహుమతులు అందజేశారు.

ఈ ఉత్సవాల్లో టీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే డిఆర్ యుసిసి సభ్యుడిగా గోండాల సురేష్ బాబు నియామకం.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్:

దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా గోండాల (బ్యాగుల) సురేష్ బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించి, ఈ అవకాశం కల్పించిన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, రైల్వే అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకం ఉంచి సహకరించిన ప్రతి ఒక్కరికి మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

వేగుచుక్క
సీనీత శ్రీలం గొంతుక...

'జైలర్ 2'కు భారీ స్పందన.. 6 లక్షలు దాటిన టికెట్ల అమ్మకాలు!

హైదరాబాద్, అక్టోబరు 13

సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా విడుదలకు ముందే ముందస్తు టికెట్ల విక్రయాల్లో మంచి స్పందన కనిపిస్తోంది. ప్రముఖ టికెట్ విక్రయ వేదిక బుక్‌మైషోలో ఈ చిత్రానికి సంబంధించిన టికెట్ల అమ్మకాలు ఆరు లక్షల మార్కును దాటినట్లు సమాచారం. విడుదలకు ముందే ఈ స్థాయిలో స్పందన రావడం సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది. నాలుగో రోజూ భారీగా టికెట్ల విక్రయాలు 'జైలర్ 2' ముందస్తు టికెట్ల విక్రయాలు ప్రారంభమైనప్పటి నుంచి గణనీయమైన సంఖ్యలో అమ్మకాలు నమోదవుతున్నాయి. బుక్‌మైషోలో నాలుగో రోజు ఒక్కరోజే 2.47 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచా రం. అంతకుముందు రోజు సుమారు 3.05 లక్షల టికెట్లు విక్రయమయ్యాయి. దీంతో పోలిస్తే నాలుగో రోజు అమ్మకాలు కొంత తగ్గినప్పటికీ, మొత్తం ముందస్తు విక్రయాలు మాత్రం ఆరు లక్షల మార్కును దాటినట్లు తెలుస్తోంది.

దర్శకుడి అసభ్య ప్రతిపాదన.. నటి నీతి టేలర్ సంచలన వ్యాఖ్యలు!

హైదరాబాద్, అక్టోబరు 13

సినీ పరిశ్రమలో పేరు ప్రఖ్యాతులు, అవకాశాలు కనిపించినప్పటికీ.. వాటి వెనుక కొందరు నటీనటులు చేదు అనుభవాలను ఎదుర్కొంటుంటారు. ముఖ్యంగా కొత్తగా పరిశ్రమలోకి అడుగుపెట్టే వారికి అవకాశాల పేరుతో అనుచిత ప్రతిపాదనలు ఎదురవుతున్నాయనే ఆరోపణలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తుంటాయి. గతంలో 'మీటూ' ఉద్యమం ద్వారా పలువురు నటీమణులు తమ అనుభవాలను బయటపెట్టారు. తాజాగా నటి నీతి టేలర్ తన సినీ ప్రయాణం ప్రారంభంలో ఎదురైన ఓ చేదు సంఘటనను గుర్తుచేసుకున్నట్లు కథనాలు వెల్లడించాయి. దక్షిణాది చిత్ర పరిశ్రమలో రెండో సినిమా అవకాశం కోసం ఓ దర్శకుడు తనకు అసభ్యకరమైన షరతు విధించాడని ఆమె తెలిపినట్లు సమాచారం. రెండో సినిమా అవకాశం కోసం అనుచిత షరతు టెలివిజన్ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నీతి టేలర్ దక్షిణాది చిత్రాల్లోనూ నటించారు. అయితే, ఇక్కడ తనకు ఎదురైన అనుభవం గురించి ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. దక్షిణాది చిత్ర పరిశ్రమలో తాను రెండు సినిమాల్లో మాత్రమే భాగమయ్యానని ఆమె తెలిపినట్లు తెలుస్తోంది.

నాని సరసన రుక్మిణి వసంత్?

హైదరాబాద్, అక్టోబరు 13

సహజ నటనతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నేచురల్ స్టార్ నాని వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'బ్లడీ రోమియో'తో పాటు పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో ఆయన ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నాని మరో భావోద్వేగభరిత ప్రేమకథలో నటించనున్నారనే వార్త టాలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతోంది. తమిళంలో '96', 'మెయ్యళగన్' వంటి హృద్యమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో నాని ఓ సినిమా చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో కథానాయికగా కన్నడ నటి రుక్మిణి వసంత్ పేరు వినిపిస్తోంది. భావోద్వేగాల ప్రేమకథలో.. సి. ప్రేమ్‌కుమార్ సినిమాలు ప్రేమ, అనుబంధాలు, మానవీయ భావోద్వేగాలకు ప్రాధాన్యమిస్తుంటాయి. నాని కూడా కథాబలమున్న చిత్రాలను ఎంచుకోవడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ ఇద్దరి కలయికలో సినిమా రూపొందితే ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతి అందుతుందని అభిమానులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో కథానాయిక పాత్రకు కూడా ఎంతో ప్రాధాన్యం ఉండనున్నట్లు ప్రచారం సాగుతోంది. కథను ముందుకు నడిపించే బలమైన పాత్ర కోసం చిత్రబృందం రుక్మిణి వసంత్‌ను సంప్రదించినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. వరుస అవకాశాలతో రుక్మిణి కన్నడ భామ రుక్మిణి వసంత్ తన సహజమైన నటనతో దక్షిణాది ప్రేక్షకులకు చేరువయ్యారు. 'సప్త సాగరాలు దాటి' చిత్రంలో ప్రియ పాత్రతో తెలుగు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత 'కాంతార: చాప్టర్ 1'లో కీలక పాత్ర పోషించి మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. విభిన్న కథలు, బలమైన పాత్రలకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్న ఆమెకు ఇతర భాషల్లోనూ అవకాశాలు పెరుగుతున్నాయి.

ప్రస్తుతం ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రంలోనూ రుక్మిణి నటిస్తున్నట్లు సమాచారం. ఈ భారీ ప్రాజెక్టుతో పాటు నాని సినిమాలోనూ అవకాశం దక్కిందనే వార్త అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

డిసెంబరు 4న ఆర్య 'హలో కాదల్' విడుదల!

చెన్నై, అక్టోబరు 13

తమిళ కథానాయకుడు ఆర్య నటిస్తున్న 40వ చిత్రం 'హలో కాదల్' విడుదలకు సిద్ధమవుతోంది. నిఖిలా విమల్, 'బేబీ' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న వైష్ణవి చైతన్య కథానాయికలుగా నటిస్తున్న ఈ రొమాంటిక్ వినోదాత్మక చిత్రానికి సంబంధించిన టీజర్‌ను తాజాగా విడుదల చేశారు. దీంతో పాటు సినిమా విడుదల తేదీని కూడా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబరు 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఆసక్తి రేకెత్తిస్తున్న టీజర్ విమానంలో నిఖిలా విమల్, వైష్ణవి చైతన్య మాట్లాడుకుంటున్న దృశ్యంతో టీజర్ ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో వైష్ణవి తన ప్రేమకథ గురించి వివరిస్తూ ఆర్య పాత్రను పరిచయం చేస్తుంది. అయితే, నిఖిలా విమల్ తన భర్తతో ఉన్న ప్రేమకథ అంతకంటే ఆసక్తికరంగా ఉంటుందని చెప్పడం కథపై ఆసక్తిని పెంచుతోంది. విశేషమేమిటంటే, ఆమె భర్త పాత్రలోనూ ఆర్యనే కనిపిస్తున్నారు. దీంతో కథలో ఎలాంటి మలుపులు ఉండబోతున్నాయన్న ఉత్కంఠ ప్రేక్షకుల్లో నెలకొంది.

'హ్యాపీడేస్'ను 50 సార్లు చూశా: అనుపమ

హైదరాబాద్, అక్టోబరు 13

చేతినిండా సినిమాలతో కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం ఎంతో బిజీగా ఉన్నారు. ఓవైపు అగ్ర కథానాయకుల చిత్రాల్లో నటిస్తూనే.. మరోవైపు కథానాయిక ప్రాధాన్యమున్న సినిమాలతోనూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. గతేడాది వరుసగా ఆరు చిత్రాల్లో నటించిన ఈ మలయాళీ భామ.. ఈ ఏడాది ఇప్పటికే రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తాజాగా 'క్రేజీ కల్యాణం'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆమె.. తన వ్యక్తిగత అభిరుచులు, సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. 'హ్యాపీడేస్' అంటే చాలా ఇష్టం తాజాగా ఓ ఇంటర్వ్యూలో అనుపమ తనకు ఎంతో ఇష్టమైన సినిమా గురించి మాట్లాడారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'హ్యాపీడేస్' చిత్రమంటే తనకు చాలా ఇష్టమని వెల్లడించారు. ఆ సినిమాను ఇప్పటివరకు దాదాపు 50 సార్లు చూశానని, ఇప్పటికీ టీవీలో ప్రసారమైతే తప్పకుండా చూస్తానని తెలిపారు.

నెట్‌ఫ్లిక్స్‌లో హర్ష చెముడు సిరీస్ హవా!

హైదరాబాద్, అక్టోబరు 13

తెలుగు నటుడు, హాస్యనటుడు హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన తాజా వెబ్‌సిరీస్ 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' ప్రముఖ అంతర్జాతీయ వినోద వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో మంచి ఆదరణ పొందుతోంది. రోజువారీ మొదటి పది కార్యక్రమాల జాబితాలో ఈ తెలుగు సిరీస్ అగ్రస్థానానికి చేరినట్లు సమాచారం. హిందీ ప్రేక్షకుల్లో విశేష ఆదరణ పొందుతున్న 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో'ను వెనక్కి నెట్టి ముందంజలో నిలిచినట్లు వస్తున్న కథనాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. హిందీ కార్యక్రమాన్ని వెనక్కి నెట్టి.. సాధారణంగా హిందీ కార్యక్రమాలు, వెబ్‌సిరీస్‌లకు ఎక్కువ ఆదరణ లభించే నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగు కంటెంట్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుండటం విశేషం. ముఖ్యంగా హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన వినోదాత్మక సిరీస్ మొదటి స్థానానికి చేరినట్లు వస్తున్న వార్తలు తెలుగు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే, ఈ ర్యాంకింగ్ రోజువారీ జాబితాకు సంబంధించినదే కావడంతో రాబోయే రోజుల్లో స్థానంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈటీవీ విన్ నుంచి నెట్‌ఫ్లిక్స్‌కు.. 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'కు బాబు దేగల దర్శకత్వం వహించారు. హర్ష చెముడుతో పాటు హైపర్ ఆది, జీవన్ కుమార్, ఐశ్వర్య హొల్లక్కల్ తదితరులు ఇందులో నటించారు. వినోదానికి ప్రాధాన్యమిస్తూ రూపొందించిన ఈ సిరీస్ తొలుత ఈటీవీ విన్ వేదికపై అందుబాటులోకి వచ్చింది. తాజాగా నెట్‌ఫ్లిక్స్‌లోనూ ప్రసారమవుతూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. తెలుగు వినోదానికి ప్రోత్సాహం తెలుగు కథలు, నటీనటులు డిజిటల్ వేదికల ద్వారా విస్తృత ప్రేక్షకులకు చేరువవుతున్న నేపథ్యంలో ఈ సిరీస్‌కు లభిస్తున్న ఆదరణ ప్రాధాన్యం సంతరించుకుంది. హర్ష చెముడు తనదైన హాస్యంతో ప్రేక్షకులను అలరించగా, ఇతర నటీనటుల పాత్రలు కూడా సిరీస్‌కు తోడ్పడినట్లు తెలుస్తోంది. నెట్‌ఫ్లిక్స్ రోజువారీ జాబితాలో అగ్రస్థానంలో నిలిచినట్లు వచ్చిన సమాచారం నిజమైతే, తెలుగు వినోద కార్యక్రమాలకు ఇది మరింత గుర్తింపు తీసుకొచ్చే అంశంగా నిలుస్తుంది. రాబోయే రోజుల్లోనూ ఇదే ఆదరణ కొనసాగుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



కట్స్ లేకుండా 'రణబాలి'కి యు/ఎ సర్టిఫికెట్!

హైదరాబాద్, అక్టోబరు 13

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'రణబాలి' విడుదలకు సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహించిన ఈ పాన్ ఇండియా చిత్రానికి సెన్సార్ బోర్డు యు/ఎ సర్టిఫికెట్ జారీ చేసినట్లు సమాచారం. ఎలాంటి కత్తిరింపులు లేకుండా, ఒక్క సన్నివేశాన్ని కూడా తొలగించకుండా ధ్రువీకరణ లభించడం విశేషం. దీంతో సినిమా విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చారిత్రక నేపథ్యంతో యాక్షన్ కథ 'రణబాలి' కథ 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ వలస పాలన కాలం నేపథ్యంలో సాగనున్నట్లు సమాచారం. అప్పట్లో మద్రాస్ ప్రెసిడెన్సీలో, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో నెలకొన్న కరవు పరిస్థితులను ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారు. ఆకలితో ప్రజలు అల్లాడుతున్న సమయంలో బ్రిటిష్ పాలకులు విధించిన పన్నులను ఎదిరించి, ప్రజల పక్షాన నిలిచిన ఓ స్థానిక యోధుడి కథగా దీనిని రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ 'శింగనమల బొబ్బిలి రణబాలి' పాత్రలో కనిపించనున్నారు. చారిత్రక సంఘటనలు, భారీ యాక్షన్ సన్నివేశాలు, భావోద్వేగాలతో కథను తెరకెక్కించినట్లు ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. సెన్సార్ ప్రక్రియలో ఎలాంటి కత్తిరింపులు లేకుండా సర్టిఫికెట్ రావడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. కీలక పాత్రల్లో ప్రముఖ నటీనటులు మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ పతాకాలపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు.